క్లుప్తంగా

దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సుబ్బంపేట సాయిబాబ గుడిలో దత్త జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొలువైన దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామి వారికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు, హోమాలు నిర్వహించారు. అర్చకులు మోహన్ శర్మ, వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన శెట్టిబలిజ యువజన సంఘం నాయకులు

బుట్టాయగూడెం: శెట్టిబలిజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆ సంఘ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ పిల్లి అరవల రాజు అన్నారు. స్థానిక శివాలయం వద్ద ఆదివారం ఏజెన్సీ శెట్టిబలిజ యుజన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అరవల రాజు మాట్లాడుతూ మండలంలోని కట్టుపల్లి, నిమ్మలగూడెం, నందాపురం, బుట్టాయగూడెం గ్రామాల్లో ఉన్న యువకులతో ఏజెన్సీ శెట్టిబలిజ యువజన సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కమిటీ అధ్యక్షుడిగా గుబ్బల సత్యంబాబు, గౌరవ అధ్యక్షుడిగా సమ్మంగి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సమ్మంగి సత్యనారాయణ, ట్రెజరర్‌గా యుంద్ర వెంకటేశ్వరరావు ఎన్నికైనట్లు తెలిపారు.

ఘనంగా చండీహోమం


నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో 70వ చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) పర్యవేక్షణలో అర్చకులు మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని యాగశాలలో చండీహోమ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ తెలిపారు. పలువురు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా ఆధ్యాత్మికవేత్త పీవీ కృష్ణారావు ఆధ్యాత్మిక ప్రవచనం అందించారు. తొలుత అమ్మవారికి ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ చతుర్వేద స్వస్తి నీరాజన మంత్ర పుష్పం సమర్పించినట్లు రాజాన పండు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2.02 లక్షల విరాళం


దాతలకు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుని కుటుంబం ఆదివారం రూ.2,02,232 విరాళంగా అందజేశారు. నరసారావుపేటకు చెందిన పమిడిపాటి రవిప్రసాద్ రూ.1,01,116, అలాగే పమిడిపాటి వెంకట సుజీత్ రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ముగిసిన ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సమావేశం

ఏలూరు రూరల్: సర్వీసులో ఉన్న డ్రైవర్లు ప్రమాదశాత్తు మరణిస్తే సంఘం తరుపున రూ.15,000 నగదు సహాయం అందజేస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం నూతన అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఏలూరులోని సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల కుటుంబంలో ఆడపిల్ల పెళ్లికి రూ.5వేలు, అబ్బాయి పెళ్లికి రూ.3వేలు అందిస్తామన్నారు. ఇదే క్రమంలో ప్రమాదంలో గాయపడిన సభ్యులకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ. 5వేలు అందిస్తామని వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు డీఎస్ కొండయ్య, సలహాదారుడు వై నాగరాజు సమక్షంలో సభ్యులు పీఆర్సీ, ఇళ్ల స్థలాలు, ఎల్ఎంవీ, హెచ్ఎంవీ డ్రైవర్ల పదోన్నతులపై చర్చించారు.

మద్ది క్షేత్రంలో మహా పూర్ణాహుతి


మహా పూర్ణాహుతి హోమంలో పాల్గొన్న హనుమాన్ దీక్షాధారులు, స్వామివారి ఉత్సవమూర్తికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

మార్గశిర పౌర్ణమి మహా పర్వదినం సందర్భంగా ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మహా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూల నుంచి వచ్చిన హనుమాన్ దీక్షాధారులు మద్ది క్షేత్రంను దర్శించుకుని మహా పూర్ణాహుతి హోమగుండంలో తమ ఇరుముడులను సమర్పించారు. స్వామివారి ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ చందన ఏర్పాట్లు పర్యవేక్షించారు.
– జంగారెడ్డిగూడెం రూరల్

శ్రీవారికి కోర్ల పూర్ణిమ వేడుక


క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారి ఊరేగింపు

కోర్ల పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని క్షేత్ర పురవీధుల్లో శ్రీవారి గ్రామోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. పూజాధికాలు జరిపిన అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారు దేవేరులతో సహా క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.
– ద్వారకాతిరుమల


మంగమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు, గుబ్బల మంగమ్మ తల్లిని పూలతో ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

బుట్టాయగూడెం మండలంలోని కామవరం సమీపంలో అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చినట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. మంగమ్మతల్లిని పూలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.
– బుట్టాయగూడెం

ఇందిరమ్మ కాలనీ అండీ.. అన్నీ కష్టాలేనండి

- 18 ఏళ్లుగా అధ్వానంగా ఇందిరమ్మ కాలనీ
- కానరాని కనీస సౌకర్యాలు.. అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు
- అధికారుల పనితీరుకు అసలైన దర్పణం


చింతలపూడిలో అర్ధాంతరంగా నిలిచిన ఇందిరమ్మ కాలనీ


కాలనీకి వెళ్లే రోడ్డు ఇదేనండి..

చింతలపూడి: అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా కళకళలాడాల్సిన ఆ కాలనీ ప్రస్తుతానికి కళ తప్పి అధ్వానంగా మారింది. ఆ కాలనీలోకి అడుగు పెట్టడానికి లబ్ధిదారులు సైతం జంకుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడి మోడల్ కాలనీ సమీపంలో 2006లో ప్రభుత్వం రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి 75 మంది ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారు. వీరికి అప్పట్లోనే ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేశారు. పంపిణీ సమయంలో సరైన లేఅవుట్ చేయకపోవడం, రోడ్డు సౌకర్యం కూడా కల్పించకపోవడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. బయటి నుంచి ఇళ్ల నిర్మాణానికి సామగ్రి తెచ్చుకునేందుకు సరైన సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ధైర్యం చేసి కొందరు నిర్మాణాలు మొదలు పెట్టినా సౌకర్యాలు లేకపోవడంతో మధ్యలోనే నిర్మాణాలను నిలిపివేశారు. ఈ అసంపూర్తి కాలనీకి వెళ్లడానికి రోడ్డు ఎక్కడుందో కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు. ప్రస్తుతం కాలనీ అంతా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి పోయి ఉంది. ముందు చూపు లేకుండా పట్టాలు పంపిణీ చేసిన ప్రభుత్వం రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో గత 18 ఏళ్లుగా ఈ ఇందిరమ్మ కాలనీ ఆలనా, పాలనా కరువయ్యి దిక్కూ, మొక్కూ లేక పడి ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ పట్టాలు పొందిన లబ్ధిదారులు ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారో, ఏమైపోయారో కూడా తెలియడం లేదు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, మార్కెట్లో సిమెంట్, ఇసుక, ఐరన్‌తో పాటు కూలి ధరలు పెరిగిపోవడంతో వీటి నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. అధికారులు స్పందించి లబ్ధిదారులను గుర్తించి కాలనీకి రోడ్డు, వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి



ఇందిరమ్మ కాలనీకి ప్రభుత్వం వెంటనే మౌలిక సౌకర్యాలు కల్పించాలి. ఇళ్ల కాలనీ మంజూరు చేసి ఏళ్ల గడుస్తున్నా కనీసం రోడ్డు సౌకర్యం కల్పించక పోవడం దారుణం. వెంటనే రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.
తొర్లపాటి బాబు, సీపీఐ నాయకుడు, చింతలపూడి

రోడ్డు సౌకర్యం లేదు



ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేశారు. కాలనీకి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం మాత్రం లేదు. పొలాలకు అడ్డంపడి వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలం అయితే కాలనీలోకి వెళ్లడం కష్టం. వెంటనే రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటాం.
– ఎస్‌కే మొహిద్దీన్, మోడల్ కాలనీ, చింతలపూడి

142 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని గీతా భవనంలోఆదివారం లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు పేదలకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 142 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి 18 మందికి ఆపరేషన్ చేయాల్సిందిగా నిర్ధారించారు. వారిని పరమహంస హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా 34 మందికి కళ్లజోళ్లు సబ్సిడీపై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నై వెంకటరామయ్య, పి.విఠల్ శిబిరానికి హాజరైన వారికి సేవలు అందించారు. అవసరం ఉన్నవారికి ఐ డ్రాప్స్, టాబ్లెట్స్ ఉచితంగా పంపిణీ చేశారు.

ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఆదివారం ఆవిష్కరించారు. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్టీ ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

సమష్టి కృషితో యువత ఎదగాలి


పండు పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: పండు పొగాకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు బ్యాంకుల ద్వారా రూ.పది లక్షల వరకు వడ్డీ లేని రుణం కల్పించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం రోడ్డులో ఎంపీటీసీ ఘంటసాల సీనమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పండు పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. యువకులంతా బృందంగా ఏర్పడి వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, వారంతా సమష్టి కృషితో ఎదగాలి అని అన్నారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో సుమారు యాభై వేల మందికి పండు పొగాకు క్రయవిక్రయాలు జీవనోపాధిని కలిగిస్తున్నాయని, కావును ప్రభుత్వం ఇటువంటి వ్యాపార కేంద్రాలని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ నాయకులు నూకల రాము, ఎస్‌కే బాజీ, ముప్పిడి వెంకట్రావు, జి.సాయి, జి.మధు, ముప్పిడి వెంకటేష్, ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

మళ్లీ వెలసిన మాంసం, చేపల దుకాణాలు


ద్వారకాతిరుమల కొత్త బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన చేపల వ్యాపారాలు

ద్వారకాతిరుమల: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని రహదారి పక్కన మళ్లీ మాంసం, చేపల దుకాణాలు వెలిశాయి. నిబంధనలను తుంగలోకి తొక్కి మరీ కొందరు వ్యాపారులు ఆదివారం ఇష్టానుసారం వ్యాపారాలను సాగించారు. సెలవుదినం కావడంతో అధికారులెవరూ ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ద్వారకాతిరుమల కొత్త బస్టాండు సమీపంలోని రహదారి పక్కన గతంలో చేపలు, మాసం వ్యాపారాలు జరిగేవి. అయితే ఆర్టీసీ బస్సులు, బైక్‌లు, ఇతర వాహనాల ద్వారా క్షేత్రానికి వచ్చే భక్తులు ఈ దుకాణాల వద్ద నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. అలాగే దుకాణాలు రోడ్డుపక్కన ఉండటం వల్ల మాంసం, చేపలపై దుమ్మూ, దూళి పడి ప్రజారోగ్యానికి హాని కలుగుతుందని స్థానికులు అప్పట్లో పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్షేత్ర ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని మాంసం దుకాణాలను మూడేళ్ల క్రితం సంతమార్కెట్‌లో నిర్వహించుకోవాలని వారు వ్యాపారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఈ వ్యాపారాలు సంతమార్కెట్‌లోనే జరిగాయి. అయితే వ్యాపారుల మధ్య నెలకొన్న పోటీ కారణంగా ఈ దుకాణాలు మళ్లీ రోడ్డు పక్కకు చేరాయి. స్థానికంగా అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో, అడిగేవారు లేక వ్యాపారులు తమ కార్యకలాపాలను యథేచ్ఛగా సాగించారు. దీంతో క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పలేదు.

కళాకారుడిగా కొనసాగడం పూర్వజన్మ సుకృతం


సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావును సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కళాకారుడిగా కొనసాగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు అన్నారు. బుర్రకథ కళాకారుడుగా ఉద్భవించి 70 సంవత్సరాలు అయిన సందర్భంగా సబ్బి కనకారావుకు మండలంలోని లక్కవరం గ్రంథాలయంలో గ్రామ ప్రముఖులు, కళాకారులచే సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్బి కనకారావు మాట్లాడుతూ నాటి కాలంలో ప్రజలను చైతన్య పరచటానికి కళలు ఎంతగానో ఉపయోగపడేవని, దానిలో భాగంగానే ప్రజానాట్యమండలి ద్వారా కళాకారునిగా అరంగ్రేటం చేసినట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే వైఎస్సార్, కొనిజేటి రోశయ్య, నారా చంద్రబాబు నాయుడు వంటి ముగ్గురు ముఖ్యమంత్రులచే సత్కారాలు పొందిన కళాపిపాసి కనకారావు అని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. అనంతరం ఆయన్ను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ వ్యవస్థాపక సభ్యులు తడికమల్ల రామకృష్ణ, వర్తక సంఘం అధ్యక్షుడు చిక్కాల ఆంజనేయులు, అరసం రాష్ట్ర కార్యదర్శి బీవీఎస్ సాగర్, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సబ్ కన్వీనర్ టీవీఎస్ రాజు, ఏబీవీపీ రాష్ట్ర అవార్డు గ్రహీత షేక్ ఇబ్రహీం, ప్రముఖ కళాకారులు చిలుకూరు సుబ్బయ్యాచారి, వీరమల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం.. అజరామరం


జంగారెడ్డిగూడెం: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ఏకలవ్య మోడ్రన్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా అన్నారు. ఆ పాఠశాలలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. దేశానికి సేవలందించిన స్వాతంత్రోద్యమ నాయకులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ మెంబర్ మొడియం నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శనీయుడు

చింతలపూడి: స్థానిక నగర పంచాయతీలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నేతల చిత్రపటాలకు నగర పంచాయతీ కమిషనర్ డి పావని, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు సాధించి పెట్టిన ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పొట్టి శ్రీరాములు జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు చిట్లూరి ధర్మరాజు, వజ్రపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి ఆదివారం కన్నాపురం రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాటూరు సుధీర్ శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన శ్రీరాములు ఆశయాలను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కంభంపాటి సాయి, మోటమర్రి ఉమ, చిరువూరు శ్రీనివాస్, మండవ నాగేశ్వరరావు, కొల్లూరు కిషోర్, వీఎస్ఎన్ స్వామి, ఎంవీ రామకృష్ణ, బోనగిరి పాపారావు, కొల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


జంగారెడ్డిగూడెం: పట్టణంలో అమలరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిటీకేబుల్ ఎండీ చిన్ని హరీష్‌గుప్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు, స్థానిక ప్రముఖులు బుట్టాయగూడెం రోడ్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రగళ్లపాటి కాశి, కోలాటి నాగేశ్వరరావు, ఇమ్మడి బాల భాస్కర్, కాటేపల్లి శ్రీనివాసరావు, నాగసూరి బాల సుబ్రహ్మణ్యం, మానేపల్లి రవి, గోవర్ధన్ బాబి, తేజ, వాసు తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: పొట్టి శ్రీరాములుకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు


బుట్టాయగూడెం: ఈఎంఆర్ స్కూల్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం


చింతలపూడి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విలేకరులపై దాడికి ప్రభుత్వం బాధ్యత వహించాలి


మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

కొయ్యలగూడెం: విలేకరులపై దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి అని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. కన్నాపురం రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద ముఖ్య నాయకుల సమావేశాన్ని మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఇటీవల పులివెందుల మండలం వేములవాడ నియోజకవర్గంలో సాక్షి మీడియా, హైదరాబాదులో టీవీ9 ప్రతినిధులపై దాడిని ఆయన ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి అని సమావేశం డిమాండ్ చేసింది. అదేవిధంగా ఈనెల 26వ తేదీతో సీపీఐ పార్టీ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నామని, శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, చెక్కిరెడ్డి సోమరాజు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

దెందులూరు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు తెలిపారు. ఆదివారం రాజమండ్రిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఫైనల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు.